క్లుప్తంగా

బీసీసేన గ్రామ కమిటీ ఏర్పాటు



నూతన అధ్యక్షులకు నియామకపత్రాలు అందిస్తున్న చెన్నయ్య

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో బీసీసేన మండల అధ్యక్షుడు బోయ చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం బీసీసేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కార్తిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. బీసీలందరూ ఏకమైతేనే హక్కులు అందుతాయన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

కోటమైసమ్మకు ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో కోటమైసమ్మ, పోచమ్మ దేవాలయాల్లో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తేజస్విని, శ్రీ అంబ భవానీ మాత దేవాలయ చైర్మన్ ముత్యాలరాజు, మాజీ సర్పంచ్‌లు బెంది మోహన్‌రెడ్డి, బెంది పద్మమ్మ, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్‌గౌడ్, విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్

కేశంపేట: మండలంలోని లేమామిడి మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ ఆయన మేనకోడలు హరిణిప్రియ జ్ఞాపకార్థం గురువారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, టై, బెల్టులు, స్టేషనరీ పంపిణీ చేశారు. అదే విధంగా పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న లావణ్య నెల జీతంగా రూ.5వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలంలో జీపీ భవనం నిర్మించొద్దని వినతి

కొందుర్గు: మండలంలోని ఆగిర్యాలలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాన్ని మరోచోట నిర్మించాలని గ్రామస్తులు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ స్థలం పక్కనే గతంలోనే భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్, జయశంకర్, ఛత్రపతి శివాజీ, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించామని తెలిపారు. జీపీ భవనాన్ని ఇక్కడ నిర్మిస్తే విగ్రహాలకు అడ్డంగా ఉంటుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై తగు విచారణ జరిపి భవనాన్ని మరోచోట నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రమేశ్, చెన్నయ్య, సలామ్ పాల్గొన్నారు.

యువకులు నూతన ఒరవడితో ముందుకెళ్లాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణయాదవ్



మిస్టర్ రెడ్డి సినిమా హీరోను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఒరవడిలో ముందుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ముర్తుజాగూడ మాజీ సర్పంచ్ పాలమాకుల కృష్ణయాదవ్ అన్నారు. శుక్రవారం విడుదల కానున్న మిస్టర్‌రెడ్డి సినిమాలో హీరోగా నటించిన అజీజ్‌నగర్‌కు చెందిన తూర్పు నర్సింహారెడ్డి షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా తూర్పు నర్సింహారెడ్డిని మండల నాయకులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. తన నిజ జీవితంలో జరిగిన ఘటనలను ఇందులో పొందుపరిచినట్లు తూర్పు వివరించారు. కార్యక్రమంలో చిలుకూరు చిన్న, రాంచందర్‌ముదిరాజ్, సాగర్‌రాజు, నాగేశ్‌గౌడ్, బురకల ప్రకాశ్, కుమ్మరి దర్శన్, చిలుకూరు ఆచారి పాల్గొన్నారు.



మొయినాబాద్: చిన్నషాపూర్‌లో బోనాల ఊరేగింపు



షాబాద్: కుర్వగూడలో బోనాల ఊరేగింపు



మొయినాబాద్: పెద్దమంగళారంలో బోనాలతో యువతులు



మొయినాబాద్‌రూరల్: బాకారంలో బోనాల ఊరేగింపు

❖ వైభవం.. బోనాల ఉత్సవం

చేవెళ్ల నియోజకవర్గంలో గురువారం ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో వన మహోత్సవం, సీసీరోడ్లు, యూత్ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందేందుకు ప్రతిపక్షాలు ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మొద్దని తెలిపారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్య, నాయకులు పాల్గొన్నారు.

భోజనశాల ప్రారంభం



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో దాతలు పలబట్ల పాండురంగం, వెంకటరమణి దంపతుల సహకారంతో అన్నదాన సత్రాన్ని నిర్మించారు. ఈ సత్రాన్ని గురువారం దాత పాండురంగం ప్రారంభించారు. దేవాలయాల అభివృద్ధికి పాండురంగం కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా దాతలను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, రమేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధిపై అవగాహన



పాడి రైతులకు పాల ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న మాజీ రిజిస్టర్ కొండల్‌రెడ్డి, మేనేజర్ రత్నాకర్

షాబాద్: రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయని పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్టర్ కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముద్దెంగూడలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ సమక్షంలో పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపుపై రైతులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా చేయగల మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత అనే అంశంపై రత్నాకర్ పాడి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నానాజీపురం లింగం, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

బస్సులు పునరుద్ధరించాలని వినతి



డిపో మేనేజర్ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాగిరెడ్డిగూడ గ్రామస్తులు

మొయినాబాద్: ఆర్టీసీ బస్సులు రద్దు చేయడంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. తిరిగి సర్వీసులను పునరుద్ధరించాలని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తికి విన్నవించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామస్తులు మెహిదీపట్నం బస్‌డిపోకు వెళ్లి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మెహిదీపట్నం నుంచి నాగిరెడ్డిగూడ మీదుగా బాకారం వరకు 288ఎన్/బీ నంబరు బస్సులు గతంలో రోజుకు 9 ట్రిప్పులు ఉండేవని.. ఇటీవల 7 ట్రిప్పులు రద్దు చేసి కేవలం ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు మాత్రమే నడుపుతున్నారని మేనేజర్‌కు తెలిపారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. బస్సులు లేక ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించి ఉదయం 3 ట్రిప్పులు, మధ్యాహ్నం 2 ట్రిప్పులు, సాయంత్రం 4 ట్రిప్పులు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అర్జున్, మాజీ సర్పంచ్ సద్గుణాచారి, నాయకులు భిక్షపతియాదవ్, మాణిక్యం, నందకుమార్, సుధాకర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



విద్యార్థులకు నోట్‌బుక్స్, షూ అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ నేత ఇస్నాతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్, టై, బెల్టులు, షూ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న నాటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపీనాథ్, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ స్వాతి, నాయకులు ఇస్నాతి గంగాధర్, మోహన్‌సింగ్, సుధాకర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజునాయక్, ప్రశాంత్, ధరణిధర్, నవీన్, రఘు, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



మాట్లాడుతున్న బాబయ్య

షాద్‌నగర్: విద్యాశాఖలో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించడం సరికాదన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. చాలా పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో పేద విద్యార్థులకు విద్యనందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. సమావేశంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, చెంది మహేందర్‌రెడ్డి, హరిభూషణ్ పటేల్, నర్సింలు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూరు: చెరువు కట్ట మరమ్మతులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని కాశన్నకుంట చెరువుకట్ట మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూగర్భజలాల పెంపుతో పాటు సాగు, తాగునీటి అవసరాలకు చెరువులు, కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం చెరువుల మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు స్పష్టం చేశారు. వాటి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ బాలాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, కర్రోళ్ల సురేందర్, నర్సింహ, విజయపాల్‌రెడ్డి, నవీన్‌చారి, పాశంకృష్ణ, శివశంకర్‌గౌడ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులోని భగత్‌సింగ్‌కాలనీలో కట్టమైసమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల సహకారంతో కట్టమైసమ్మ దేవాలయం నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలని కోరారు. మన సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శమన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సరితయాదగిరియాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, భిక్షపతి, నడికూడ యాదగిరియాదవ్, జంగరాజు, రమేశ్, సురేష్, శ్రీశైలంగౌడ్, బీరయ్య, తులసీరాంనాయక్, నర్సింలుయాదవ్, మహ్మద్‌అలీ, నరేశ్, తుపాకుల శేఖర్, అందె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



వైష్ణవిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన విద్యార్థి వైష్ణవి బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో నాయకులు వైష్ణవి ఇంటికి వెళ్లి ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల నరేశ్, వంశీకృష్ణ, వెంకనోళ్ల వెంకటేశ్, నర్సింహ, శివ, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పిస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు సాజిద్

కేశంపేట: విద్యను అందరికీ సమానంగా చేర్చాలన్న ఆలోచనతో సంతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు సాజిద్ విద్యార్థుల కోసం ఆటో సౌకర్యం ఏర్పాటు చేసి సేవాగుణాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని సంతాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దూరంగా ఉండటంతో చిన్నారులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న విషయం తెలుసుకున్న సాజిద్, తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తెలుసుకొని తాను స్వయంగా ఖర్చులు భరిస్తూ విద్యార్థుల కోసం ఆటో సౌకర్యం ఏర్పాటు చేశాడు. దీంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వరలక్ష్మీప్రభాకర్‌రెడ్డి, రాములు, గ్రామ నాయకులు చంద్రశేఖర్, రాజు, మహిపాల్, నర్సిరెడ్డి, నరేశ్, మైసయ్య, జంగయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసులుగూడలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయాన్ని ప్రారంభించి 41 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, అశోక్, చంద్రారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్



మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరారు. అనంతరం రవీందర్ యాదవ్‌ను ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, మాజీ సర్పంచ్ బద్దుల శ్రీశైలంయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బద్దుల శివరాజ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

శంకర్‌పల్లి: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 'ప్రాజెక్టు ఉజ్వల భవిష్య'లో భాగంగా హైదరాబాద్ టైటాన్స్ రౌండ్ టేబుల్ సౌజన్యంతో డా.శివారెడ్డి కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సందర్భంగా సంస్థ 303 చైర్మన్ అభిషేక్ టిబ్రేవాల్ మాట్లాడుతూ.. 'ప్రాజెక్టు ఉజ్వల భవిష్య' కార్యక్రమాన్ని శంకర్‌పల్లి నుంచే ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ ప్రాజెక్టులో భాగంగా లక్ష మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్ల అద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలను ఎక్కువగా చూడడంతో దృష్టి లోపాలు వస్తున్నాయని, ఇది భవిష్యత్‌లో మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. తల్లిదండ్రులు వీలైనంత వరకు పిల్లలను క్రీడల వైపు దృష్టి మరల్చాలని సూచించారు. శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లోని 6, 7, 8 తరగతుల్లోని 216 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. 36 మందికి కళ్ల అద్దాలు అవసరమని వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా పరిస్థితిలో మార్పు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత, బాలుర ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, కన్వీనర్లు చైతన్య, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో సంస్థ చైర్మన్ అభిషేక్ టిబ్రేవాల్, వైద్యులు